# మంత్రనగరి సరిహద్దులలో...

కథ

కుప్పిలి పద్మ

(గతవారం తరువాయి)

చిన్నిచిన్ని గుట్టలలోంచి నడుస్తూ వో ఎత్తైన గుట్టవైపు నడుస్తున్నాడతను.

గుట్ట పూర్తిగా ఎక్కేసరికి పల్చని గోధూళి తెరలా కమ్ముకొంటోంది. చూస్తూండగానే పూదారంగు అలముకొంటోంది.

చుట్టూ చూస్తున్న ఆమె గుట్ట కిందకి చూసి 'వ్వా'... అంది.

అతని వైపు చూసింది.

మౌనపు చిరునవ్వు ముఖమంతా ఆ నవ్వుని స్పర్శించకుండా వుండలేమని మారాం చేస్తున్న చేతివేళ్లని నో...నో... అని ఆపు చేస్తూ గాలికి ముఖంపై పడుతోన్న జుట్టుని చెవి వెనక్కి తీసుకొంటూ ఆ వైపు చూసింది.

చిన్ని లోయ... క్వారీ రాళ్లు కొట్టికొట్టి ఏర్పడిన చిన్ని లోయ నిండుగా నీరు... నీలంగా... ఆ నీటిపైనంతా విచ్చుకొన్న కలువపూలు లేత ఆకుపచ్చ ఆకుల నడుమ. సవ్వడి లేని చిన్ని తరంగాల కదలిక.

ఆ గుట్ట యేటవాలులో కూర్చుంటూ ఆమె వైపు చూస్తూ 'వూఁ... యిప్పుడు చెప్పండి. రెండ్రోజులుగా వున్న కోపం పోయిందా' అని అడిగాడు.

అతని పక్క కూర్చుంటూ 'నేనెప్పుడూ యీ కలువపూల సరస్సు విషయం వినలేదే... అసలింత మూలనున్న దానిని మీరెలా కనిపెట్టారు' అడిగింది.

'రెండు రోజుల స్కోర్ సెటిల్ చేసుకోవాలిగా' చిలిపిగా నవ్వుతూ అంటున్న అతన్ని చూస్తూ 'వొక్కదానికి తిన్నగా జవాబు యివ్వడు కదా... తిక్క... ప్రెటీ తిక్క... లోలోపల అనుకొంటుంటే ఆమె కళ్లల్లో చిర్నవ్వు వెలుగు.

'ఏంటి' అడిగాడు.

'వుంది. కానీ చెపితే ఆ నీళ్లల్లోకి తోసేస్తారు' అంది.

'యీతొచ్చా' అడిగాడు.

'వొస్తే తోస్తారా రాకపోతే తోస్తారా'

'ఆ విషయం తర్వాత... ముందు చెప్పండి'

చెప్పనన్నట్టు కళ్ళతో చెప్పింది.

ఆకాశంలో మెరుస్తున్న తారకల కింద నుంచి అర్ధ చందమామ పల్చని వెన్నెల చల్లగా జారుతూ కలువ పువ్వులపై తడిగా మెరుస్తోంది.

ఆ నిర్మానుష్య గుట్టల నడుమ యిద్దరూ పక్కపక్కన కూర్చుని మౌనంగా ఆ పూల వెన్నెలని చూస్తున్నారు.

రెండ్రోజులు రాత్రనకా పగలనకా యితను తనని మర్చిపోయాడని బాధపడ్డాను. బెంగేసింది. తనెంత బిజీగా వున్నా అతను ఫోన్ చేస్తే మాట్లాడుతుంది. అతని మెసేజ్‌కి జవాబివ్వకుండా వుండదు. అతను పిలిస్తే మీటింగ్‌ని వదిలి వచ్చేసాను. సాయంకాలాలన్నీ అతను కనిపిస్తాడేమోనని ఎదురు చూస్తున్నాయ్. యితను తన కోసమే యిలా చేస్తాడా... చేయకపోవొచ్చు. కానీ రెండ్రోజుల బెంగని అతను మరోలా వ్యక్తపరిచాడు. యిద్దరి మనసుల్లో రాగం వొక్కటే కావొచ్చు. కానీ Expression వేరు. నా Expression లానే ఎదుటివాళ్లది వుండాలనుకోవడం లేకపోతే లేదని బాధపడటం ఎందుకు... వేర్వేరు Expressions వుంటాయ్. ఆ Expressionని గుర్తుపడితే చాలు. బోల్డంత బాధ తగ్గుతుంది కదా...

'యెక్కడో తప్పిపోయినట్టున్నారు' అన్నాడు.

మౌనంగా నవ్వింది.

యిద్దరు చాలసేపు నిశ్శబ్దంగా కూర్చున్నారు.

యింటికి తిరిగొస్తోండగా అడిగాడు 'మీ పని పాడయిందా'

లేదన్నట్టు తలూపింది.

'యీ రెండ్రోజులు పనితో అస్సలు వీలుకాలేదు. రోజూ రాత్రి రెండయేది. అంత రాత్రివేళ డిస్టర్బ్ చేయటం ఎందుకులేనని చేయలేదు. మంచి నిద్రలో వుంటారని' అన్నాడు.

'చేస్తే కాస్త కంఫర్టబుల్‌గా పడుకునేదాన్నిగా' అంది.

'యెంత కంఫర్టబుల్‌గా' అడిగాడు.

గేర్ మారుస్తోన్నప్పుడంతా కుడిచేతికి తగుల్తున్న అతని చొక్కా ఎడమచేతి ఫుల్‌స్లీవ్స్ చక్కిలిగింతలు పెడుతోంటే చిన్నిగా నవ్వి 'యిప్పుడున్నంత' అంది.

'డిన్నర్‌కి వెళదామా' అడిగాడు.

'వూ'

'ఎక్కడికి'

'మీ యిష్టం'

'ఏం తింటారు'

'మిమ్మల్ని' అని లోపల అనుకొంటూ పైకి 'ఏమైనా సరే' అంది.

'వెజిటేరియన్'

'వూ'

'రెస్టారెంట్ ఆవరణలో కారు పార్క్ చేసాడు.



లోపలంతా లేతగా అమర్చిన వెలుగు. మరీ రద్దీగానూ మరీ పల్చగానూ లేదు రెస్టారెంట్. మెనూ అందుకొని చూస్తూ 'చెప్పండి' అన్నాడు.

'మీరే ఆర్డర్ చేయండి' చివరగా కాఫీ... సౌత్ యిండియన్ కాఫీ మాత్రం కావాలి' అంది.

ఆర్డర్ చేసాడు.

తినటం ముందు త్వరగా సాగి తర్వాత మెల్లగా సాగుతోంది.

'నచ్చలేదా' అడిగాడు.

'ఆకలి తగ్గింది' అంది.

'ఏదైనా ముందు కాస్త ఆత్రంగా ఆదుర్దాగా వుంటుంది- ఆకలైనా... స్నేహమైనా' కొంటెగా నవ్వుతూ అన్నాడు.

'వాటికి కావల్సినది దొరుకుతుందో లేదో అనే సందిగ్ధం బెంగగా వుంటుంది' అతని వైపు చురుగ్గా చూస్తూ చప్పున అనేసింది.

బిల్ వచ్చింది.

అతను పే చేయబోతోంటే 'నేనూ' అంది.

అతను నవ్వి పే చేసాడు. బేరర్ మిగిలిన చిల్లర బిల్ ఫోల్డర్‌తో తెచ్చాడు.

ఆమె బిల్ పేపర్ తీసుకొని పడవ చేసింది. ఆ పడవని హేండ్‌బ్యాగ్‌లో వున్న ఎడ్రస్‌ల పుస్తకం నడుమ దాచింది. తామిద్దరు తొలిసారిగా రెస్టారెంట్‌కి వొచ్చిన జ్ఞాపకపు గుర్తుగా.

** ** **

తెల్లార్తూనే అతన్నెప్పుడు పలకరిద్దామని సాయంకాలం అతన్ని కలుస్తాననే తలంపు నిండుగా మెదుల్తుంటే వుత్సాహమే వుత్సాహం. ఆఫీసు పనిలో చికాకుల్ని సీరియస్‌గా నరనరాల్లోకి ఎక్కించుకోవటం తగ్గింది. అతనికి ఎలాంటి చికాకునైనా చెప్పినా క్షణంలో అదెంత చిన్నదో అనవసరమైన టెన్షనో గొప్ప సెన్సాఫ్ హ్యూమర్‌తో చెపుతోంటే రానురాను చిన్నచిన్న వాటికి హైరానపడటం తగ్గింది.

ఆరోజు ఆఫీసు లోంచి బయటికి వస్తుంటే సెల్‌కి మెసేజ్ వొచ్చింది.

'బంజారాలైన్‌కి పున్నాగపూల దగ్గరికి వొస్తారా'- అని అతన్నుంచి.

వస్తానని రిప్లయి యిచ్చింది.

ఆమె అక్కడికి వెళ్లేసరికి అతను కారుకి ఆనుకొని నిలబడి వున్నాడు. కమ్ముకుంటోన్న దొంతర్లుదొంతర్లుగా పూలసౌరభం పక్కనే అతని సామీప్యపు పరిమళం. ఆమె చూపులు పువ్వుల మీద కంటే అతనివైపు చూస్తామని మారాం చేస్తుంటే వాటిని ఏం అనలేక ఆఁ ఏమైతే అయిందిలేనని వాటిని వదిలేసింది.

వాక్కాయ రంగు ప్లేన్ ఫుల్‌స్లీవ్స్ షర్ట్... కాస్త వొత్తుగా పెరిగిన నల్లని గెడ్డంలోంచి అక్కడక్కడ తారకల్లా మెరుస్తోన్న వొంటిఛాయ. చూపుడు వేలితో ఆ మెరుపుని తాకాలనే చిలిపి కోరిక. అతనేం అనుకుంటాడనే తటపటాయింపు.

'మీకీ సాయంకాలం వేరే పనేం లేదా... యింట్లో వాళ్లతోనో ఫ్రెండ్స్‌ని కలవటమో, షాపింగ్ యిలా చాలుంటాయి కదా' అడిగాడు.

'అక్కడెక్కడికో వెళితే మిమ్మల్ని కలవటం ఎలా'

'నేనొస్తాననో కలుస్తాననో మీరిలా అన్నీ మానేయటం ప్చ్... బరువుగా వుంటుంది. నాకేమో అవన్నీ తప్పవ్...కొన్ని పనులు స్నేహంతో మరి కొన్ని బిజినెస్‌పరంగా... రకరకాలుగా... మీరేమో అన్నీ మానేసి...' నొచ్చుకొంటూ అన్నాడు.

'చాల యిష్టమైతే తప్పా కొన్ని పనులు చేయలేను. ఆఫీసు పని చేస్తాను. ఆఫీసులో వొంటరితనం. అన్నివిధాలుగా మా భాషలు వేరనిపిస్తాయి. యీ గెట్ టుగెదర్స్‌లో ఏముందానే కుతూహలం మొదట్లో వుండేది. వొక్కసారికే బోర్ కొట్టాయి. సోషల్ గేదరింగ్స్ దగ్గర మిత్రులవి అయితే పెళ్లైనా సీమంతమైనా పుట్టినరోజైనా క్యాజువల్ పార్టీయైనా వరలక్ష్మీవ్రతమైనా క్రిస్‌మస్ పార్టీ యీద్ పార్టీ దేనికైనా వెళతా... సందర్భం కంటే మనుష్యుల presence ముఖ్యం. మోహంగా వుంటే అన్నీ వదిలేసుకోవాలనుంటుంది. మీ presence ముందు మిగిలినవి ప్చ్.... ముఖ్యమనిపించటంలేదు. యిష్టమైన ఎదురుచూపు కదా...మీరెందుకు నొచ్చుకుంటారు' అందామె మెల్లగా. మనసులోనిది చాల క్యాజువల్‌గా చెపుతోంటే అతనికెంతో ముచ్చటగా ఆశ్చర్యంగా అనిపించి 'ఎందుకని మీకిలా అనిపిస్తోంది' అడిగాడు.



ఏమో అన్నట్టు భుజాలతో అంది.

అతనిలో మేఘాలు మేఘాలుగా ఆలోచనలు పరిగెడుతున్నాయి. ఎలా మాట్లాడాలో తెలియటంలేదు. యీ మొత్తం ఏమిటో... అతనికి మొహమాటంగా అనిపించింది.

'వెళదామా' అడిగాడు.

'అప్పుడే'

'ఐదు నిమిషాలా' అడిగాడు.

'వూ'

అతను ఆమె చేతివైపు చూస్తూ 'యిద్దరికి వాచ్‌లేదు' అన్నాడు.

'ఫైన్... నేనెప్పుడు చెపితే అప్పుడు ఐదు నిమిషాలు అయినట్టు' అంది.

'అంత శ్రమవొద్దు'అంటూ సెల్‌లో చూసాడు.

'అన్యాయం' అంది.

అతను నవ్వి 'మీ టైమ్ మొదలయింది' అన్నాడు.

'నేనేం వొప్పుకోను'

తిరిగి నవ్వాడు. చూపులు టైమ్ నుంచి తీయకుండానే.

ఐదు నిమిషాలు అవ్వగానే 'వెళదాం' అని కారులో కూర్చున్నాడు.

ఆమె యింకేం అనలేక తన కారు స్టార్ట్ చేస్తూ 'కాఫీ తాగుదామా' అడిగింది.

అతను ప్రవాహంలా నవ్వుతూ 'యిప్పటి వరకూ వున్నాంగా మీరు తాగండి' అన్నాడు.

'రారా...'

'ఏంటీ 'రా' 'రా' నా'

'ఆఁ'

'భయం పోయింది గౌరవం లేదు ఆఁ'

'ఏంటీ రారా అన్నాను అంతేగా... చప్పున అర్థమై 'హో... అలా 'రా' కాదు.

'భయం భక్తి గౌరవపు 'రారా'నే అంటూ నవ్వింది.

'భలే ట్రిక్కీ పదం కదా... ఎక్కడ తాగుతారో తాగండి. బై' అన్నాడు.

అతనంత పట్టనట్టు వెళ్లిపోతోంటే 'ఏదో తనుంటే కాఫీ మరింత రుచిగా వుంటుందని రమ్మనటం తప్పా వెళ్లి కాఫీ తాగలేక కాదు' వుక్రోషంగా అనుకొంది.

యింట్లోకి వెళుతోంటే 'కాఫీ యిస్తారా' మెసేజ్ యిచ్చాడతను.

ఆమె కళ్లల్లో వెలుగు.

'వూ' అని మెసేజ్ యిచ్చింది. 'ఎక్కడ' అని తిరిగి యిచ్చాడు. 'మా యింటికి రావొచ్చు' అని యిచ్చింది.

అతనొచ్చాడు.

కాఫీ కలుపుతూ 'చలి పెరిగింది కదా'... అందామె.

'వూఁ. వుదయమే బయటికి వెళ్లాల్సి వొచ్చింది. దారి కనిపించనంత పొగమంచు. కారంతా కమ్ముకుపోయింది. ఆ చల్లదనం లోపలికి కూడా పాకిపోయింది. వొళ్లంతా చల్లగా అయిపోయింది. అప్పుడెంత గుర్తొ...' ఆగిపోయి కాఫీ కప్పు అందుకొంటూ 'థాంక్‌యూ' అన్నాడు.

'వూ... చెప్పండి' కుతూహలంగా అడిగింది.

'ఏంటి'

'గుర్తొచ్చిందంటూ' ఆత్రంగా అడిగింది.

'యెప్పుడు'

'వుదయం... చలిలో... కారులో చెపుతున్నారుగా' అంది.

'హో... అదా... కాఫీ'

'వూహూ కాఫీనా' వుసూరంటూ 'వూ... తాగండి' అంది.

'ఆఁ అలాంటప్పుడు కాఫీ భలే బాగుంటుంది కదా. సరిగ్గా యిలాంటి కాఫీ అసలా చలికి యింత వేడి కాఫీ కూడా క్షణంలో చల్లారిపోతుంది. అంత చలి. యింకా చెబుతూనేవున్న అతన్ని మధ్యలోనే కట్ చేస్తూ 'సరే కాఫీ తాగండి. యిప్పుడు కూడా చల్లారిపోతుంది' అందామె నిర్లిప్తంగా.

'చల్లని కాఫీ యిష్టం. కోల్డ్ కాఫీ. కోల్డ్ రియాక్షన్'... పెదవులపై నవ్వుని బిగపెట్టినా అతని కళ్లు నవ్వుతో మెరుస్తున్నాయి.

వంటింట్లోంచి ఆమె వంటింటి గుమ్మంలోంచి అతను యిద్దరూ హాల్లోకి వచ్చారు.

ఎల్‌షేప్ సోఫా కలిసే మూల కింద కూర్చుని కాళ్లు చాపుకొని కాఫీ వో సిప్ చేసి టేప్‌రికార్డ్ లోంచి అతి చిన్నగా వినిపిస్తోన్న ijaazater పాట వింటూ 'సామాను చుట్టూ జ్ఞాపకాలు గమ్మత్తుగా వుంటాయి కదా... వుదయం నుంచి యిటు నుంచి అటు తిరగటం, పని... నిజంగా యింత బిజీ జీవితం అవసరమా అనిపిస్తుంటుంది. అసలు మనకి ఇష్టమైన వాళ్లతో గడపటానికి కూడా టైమ్ లేనంత బిజీ... ఎందుకో... మనం మన ఆప్తులతో గడిపే మూమెంట్స్ అవి కదా చాల యింపార్టెంట్ లైఫ్‌లో... కానీ మన ప్రయారిటీ మాత్రం చాలసార్లు పని అని అటుయిటు పరిగెత్తటం అవుతోంది.... end of the day ప్చ్...ఎందుకీ పరుగు అనిపిస్తోంది...

ఆమె సోఫాలో వెల్లకిలా వొరిగి తల కింద చెయ్యి పెట్టుకొని అతని వైపు చూసింది. సోఫా అంచున ఆన్చినచెయ్యి... బాటిల్ గ్రే ప్లేన్ ఫుల్ స్లీవ్స్ షర్ట్ చివర్ల నుంచి లేత తమలపాకులా మెరుస్తోన్న కుడి అరిచెయ్యి. నల్లని కప్పుపై పచ్చగా మెరుస్తోన్న పల్చని ఎడమ చేతివేళ్లు... అప్పుడప్పుడూ కదుల్తున్నాయి కప్పు వెచ్చదనానికి... వొక్కసారి ఆ వేళ్లని స్పర్శించాలనే బలమైన తృష్ణ... ఎలా వుంటాయో... నెమలి యీకంత మృదువుగా మౌనమంత లలితంగా మంచుబిందువులంత చల్లగా శీతాకాలవు నెగడులా వెచ్చగా వొక్కసారి స్పర్శిస్తే... చూపులన్నీ అతని చేతివేళ్లమీదే. పున్నాగపువ్వులాంటి సొగం ధపూరిత వేళ్ల కొనల మీదే ఆలోచనా స్రవంతి సమస్తమూ నిలిచిపోయి వొకే వొక్క బిందువు దగ్గర ఆగిపోయినట్టు...

ఆమె చూపులు వేళ్లచివర్ల మృదువుగా గుచ్చుకొంటుంటే ఆమె కళ్లల్లోకి మౌనంగా చూస్తున్నాడు. నిశ్శబ్దపు అలజడి పరిమళం మహత్తరంగా ప్రవహిస్తోంది. శీతలత్వం వెచ్చగా అలముకొంటోంది. రసైకజ్వాలలో వెలుగుతోన్న శీతలత్వపు వివశత్వం... వొక్కసారి ఆ వేలి కొనలని స్పర్శిస్తే... ఆమె హృదయంలో వెచ్చగా రాజుకొంటోన్న నిషా... వొక్కసారి ఆ వేలి కొనలని స్పర్శిస్తే ఏదో స్మృతిని రేపుతోన్న అతని చూపులు– ఆమె చేతివేళ్లు చప్పున వెనక్కి వచ్చేసాయి... ఎన్నాళ్లిలా... మంత్రనగరి సరిహద్దులు ముట్టకు... తాకకు...

** ** **


వో పక్క పని మరో పక్క రెండ్రోజులుగుంచి అతన్నుంచి ఫోన్ లేదు. సెల్ ఆఫ్ చేసుంది. యిచ్చిన మెసేజెస్‌కి రిప్లై లేదు. పెండింగ్ అనొస్తున్నాయి.

ఏంటో యీ కుర్రాడు...

ఆఫీసు నుంచి బయటకి రాబోతుంటే ఫోన్ మోగింది. తీసింది.

'ఏమైపోయారు. గోవావెళుతున్నా. కాన్ఫరెన్స్. మీకిలా చెప్పాలని చూస్తున్న. అయినా నా గొడవే తప్పా... మీకెన్నిసార్లు చెప్పినా చెప్పాపెట్టకుండా మాయమైపోవటమే' అంది త్వరత్వరగా.

'వయా బెంగుళూర్... అంటూ తన ప్రోగ్రామ్ చెప్పింది.



'వోకే...
టేక్ కేర్... ఆల్ ద బెస్ట్...'

'మీకసలు పూరెళుతున్నాననే బెంగేలేదు. కనీసం ఎర్‌పోర్ట్‌లోనైనా కనిపించొచ్చుగా. వూ... వోకే.... థాంక్‌యూ...' వుక్రోషంగా అంది.

అట్నుంచి చిన్ని నవ్వు.

'పనిపై అటూయిటూ వెళ్లటం అలవాటేగా... బెంగెందుకు' అంటూ అతను 'బై' అన్నాడు.

అతను రాడని తెలుస్తూనే వున్నా ఆమె కళ్లు ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టినప్పట్నుంచి అతని కోసం వెతుకుతునే వున్నాయి. సెక్యూరిటీ చెక్‌లోకి వెళ్ళబోతూ మరోసారి వెనక్కి చూసింది. అతనెక్కడా కనిపించలేదు. బెంగగా లోపలికి వెళ్లింది. ఎందుకిలా తన మనసెప్పుడూ అతనిని వెతుకుతోందో...

మబ్బుల పైనుంచి పక్క నుంచి లోనుంచి వెళుతోన్నా తన మనసు అతనినే అంటిపెట్టుకొని కిటికీలోంచి బయటికి చూస్తోంది...తెల్లని పూదా రంగులపై మెరుస్తోన్న చలికాలపు సూర్యరశ్మి తుళ్లింతగా... అతని నవ్వులా.

కాన్ఫరెన్స్ అయి హాల్లోంచి బయటకివొస్తొంటే 'హాయ్' అంటూ ఎదురొచ్చాడు. అతన్ని చూస్తూనే ఆమె 'మీరూ...' ఆశ్చర్యం సంబరం వుద్వేగం ఆమె ముఖమంతా.

'కాఫీ తాగుదామా' అడిగాడు.

'వూ'- కాఫీ షాప్‌లో వొకరికెదురుగా వొకరు.

'ఎప్పుడొచ్చారు... ఎలా వొచ్చారు' అడిగింది.

ఆమె చూపుల్లోకి చూపులు ప్రసరిస్తూ 'వొచ్చాను' అన్నాడు.

'వచ్చినట్టు తెలుస్తూనే వుంది. ఎప్పుడూ ఎలా...'

'మీకేం కావాలి'

'ఎప్పుడొచ్చారు' తిరిగి అడిగింది.

'తినటానికేం కావాలి' కొంటెగా నవ్వుతూ అడిగాడు.

ఆ స్వరపేటిక తంత్రులకి యీ కొంటెరాగాల మురళిని అద్దిందెవరో అనుకొంటూ యీ చెప్పని తనమే ఆకర్షణ. యీ చెప్పనితనమే ఆకర్షణ అనుకొందామె.

'కాఫీ' అందుకొంటుంటే ఆమె చూపులు అతని చేతి గోళ్లపై నిలిచాయ్.

లేత గులాబీగా మెరుస్తోన్న గోళ్ల వర్ణం. యితనిలో ఎప్పుడూ వో కొత్త అందం కనిపిస్తొంటుంది. చిన్నప్పుడు యితను ఎలా వుండేవాడో...

'మీ చిన్నప్పటి ఫోటో వొకటి చూపించరా'

హఠాత్తుగా ఆమె అలా అడిగేసరికి 'చిన్నప్పటిదా...వొకటా...'అడిగాడు కాస్త అయోమయంగా.

'వూ' అంది.

'ఎందుకు'

'చిన్నప్పుడూ యింత అందంగానూ వున్నారా... అసలప్పుడు మీరెలా వున్నారో'

కాఫీని నిశ్శబ్దంగా తాగారిద్దరు.

'బయటికి వెళదామా' అడిగాడు.

'రూంలో యివి పెట్టేసి వొస్తా' అందామె.

'వూ'

'రండి' అంది.

కాన్ఫరెన్స్ పేపర్స్ రూంలో పెట్టి అతనితో బయటకొచ్చింది.

హోటల్లోంచి బయటకొచ్చి పేవ్‌మెంట్‌పై నడుస్తూ యిద్దరూ మెల్లగా బీచ్ వొడ్డుకి వొచ్చారు.

దిగంతంలోకి వాలి వెళ్ళిపోతోన్న సాయంకాలపు సూర్యరశ్మి చిలకరించిన రంగురంగుల పల్చని కాంతితో మెరుస్తోన్న అరేబియా సముద్రానికి యెదురుగా నిల్చున్నారిద్దరు. ఆరవిడిచిన తలంటిన జుత్తు సముద్రపు గాలికి రివ్వున ఎగురుతో అతని భుజాలకి తాకుతోంది. లేత పసుపురంగు చొక్కాపై పర్చుకొంటోన్న నల్లనిజుత్తుని మెల్లగా చేత్తో తాకాలనిపించిందతనికి. కానీ... ఏదో తెలియని సంశయం... అంతలోనే చూద్దాం... అనే చిన్ని కొంటెతనం.

'విశాఖ సముద్రానికున్న హోరు ఏ సముద్రానికి వుండదేం' అంది.

అతను చిన్నగా నవ్వుతూ 'మీ హృదయాన్ని విశాఖకి తగిలించేసినట్టున్నారు' అన్నాడు.

'అయినాసరే నాకెప్పుడూ హైదరాబాద్ మీదే బెంగగా వుంటుంది. ఎక్కడికి వెళ్లినా సరే ఎంత త్వరగా హైదరాబాద్ వెళ్లిపోదామని వుంటుంది' అంది.

అతను చిన్నగా నవ్వుతూ 'ఎప్పట్నుంచి' అడిగాడు.

'ఆ... వో... మీరు పరిచయం అయినప్పట్నుంచి' అంది నవ్వుతూ.

చూస్తుండగానే లేత పూదా తెరలని అందుకోవాలని గాఢనీలపు కెరటాల ఆరాటం కమ్ముకుంటుండగా 'ఎప్పుడొచ్చారు...మీరలా రోజూ మాట్లాడకపోతే ఎలా' ఆమె అడిగింది.

అతను వెంటనే మాట్లాడలేదు.

మసక వెల్తుర్లో మెరుస్తోన్న ఆమె చూపులని చూస్తూ 'లొకేషన్ లేట్‌గా సెలక్ట్ అయింది. డే అండ్ నైట్ వర్క్. మీతో చెపుదాం అనుకొంటూ కాల్ చేసానా... మీరు గోవా వస్తున్నానన్నారు. అకొంట్ యిలా సెటిల్ చేయొచ్చనిపించింది' అన్నాడు.

'వో' అంది.

టూరిస్ట్‌ల కోలాహలంతో బీచ్ సందడిగా వుంది.

యిసకలో నడుస్తూ పేవ్‌మెంట్ పక్క నుంచి కాస్త దూరం వచ్చారు. చిన్ని పాత రెస్టారెంట్ లోంచి పాత గోవా మ్యూజిక్ వినిపిస్తోంటే యిద్దరు వెళ్లి కూర్చున్నారు. పాత పాటలు వొస్తున్నాయి.

'ఏం తింటారు' అడిగాడు.

'మీ యిష్టం' అంది.

అతను ఫుడ్ ఆర్డర్ చేస్తూ మధ్యమధ్య ఆమె అది తింటుందో లేదో అడుగుతున్నాడు.

'ఎన్ని రోజులుంటారిక్కడ' అడిగాడు.

'రేపు సాయంకాలం అయిపోతుంది. ఎల్లుండి పుదయం వెళతా'

'మీరు' అడిగింది.

ఎప్పటిలానే అతను వెంటనే మాట్లాడలేదు.

అతని వైపు చూసింది. కాండిల్ వెలుగులో గమ్మత్తుగా మెరుస్తోన్న నల్లని గెడ్డం. మధ్య మధ్యనున్న లేత పచ్చని చర్మం. తడిగా వెలుగుతోన్న చూపులు. 'వెన్నెల్లా మెల్లగా విస్తరించుకొనే యితని సౌందర్యానికి వొణుకుతోన్న మనసుకి ఏ వెచ్చని జావళి కప్పుకోవాలో... అని ఆమె అనుకొంటుండగా 'రేపు యిక్కడ్నుంచి వూరెళుతున్నా' అన్నాడు.

'ఏ వూరు' అడిగింది.

'స్విట్జర్లాండ్' అన్నాడు.

'వూరు అన్నారు'

'గ్లోబల్ విలేజ్ అంటూ విశాలమైన చిలిపినవ్వు.

'అంత దూరమా'

'ఎంత వారమేగా'

'వారమా...' బెంగగా అడిగింది.

'చూడు... వూరు కదలాలంటేనే నేనెంతో నాకు నేనే నచ్చచెప్పుకుంటూ... యిప్పుడిలా మీరు బెంగపడితే చాల కష్టంగా వుంటుంది. వెళ్లలేను. వెళ్లక తప్పదు' అన్నాడు.

ఆమె కళ్లల్లో బెంగచూసి 'వచ్చేస్తారా' అడిగాడు.

'ఊఁ'

'అంతదూరం'

'ఎంత... గ్లోబల్ విలేజ్ కదా'

'అక్కడికి వో గ్రూపుతో వెళుతున్నాం. ఖాళీ వుండదు. మీరొచ్చినా వొక్కరే చాలసేపు గడపాల్సివొస్తుంది. నా ప్రెజెన్స్ అప్పుడు చికాకు కలిగిస్తుంది... వారంలో వచ్చేస్తా' మెల్లగా నచ్చచెపుతున్నట్టు చెప్పాడు.

అదీ సంగతి. వారంరోజులు వెళ్లాలి. రేపంతా యిద్దరం బిజీ. అయినా సరే యీ దొరికిన సమయాన్ని గడపొచ్చని యిలా బయటికి తీసుకురావటం. యితని వ్యక్తీకరణంతా గమ్మత్తుగా వుంటుంది. యేదీ డైరెక్ట్‌గా చెప్పకపోవటం... ఆ చెప్పకపోవటం ఆదుర్దా కలిగిస్తూనే వుంటుంది. కాని అతనిలోని వెచ్చదనం మౌనంగా యింకుతోంటే ఆమె అతని వైపు చూస్తోంది.

పదవుతోంటే 'వెళదామా' అడిగాడు.

'అప్పుడే'

'వూ'

'మళ్లీ వో వారం వరకు కనిపించరు కదా... యింకాసేపుందాం' అంది.

'కాస్త పనుంది'

'రేపు చూసుకోండి' యిద్దరూ కాసేపు ఆ సముద్రం వొడ్డున తిరిగారు. ఆ చలిని తట్టుకోలేక 'మా రూంకి వెళదాం రండి' అంది.

యిద్దరు రూంలోకి వచ్చారు. ఆమె సౌత్‌యిండియన్ కాఫీ ఆర్డర్ చేసింది. అతను సోఫాకి ఆనుకొని కింద కాళ్లు చాపుకొని కూర్చున్నాడు. ఆమె సోఫాపై వెల్లకిలా వొరిగి తల కింద వో చెయి ఆన్చుకొని. అతని పల్చని శరీరపు యింటిమేట్ పరిమళం ఆమెకి తగులుతుంది. పల్చని నల్లని గెడ్డపు చివర్లు తాకాలని ఆ వొత్తైన తేనె రంగు క్రాఫంతా చెరిపేయాలని ఆ అర్ధ చంద్రుని నుదిటిపై చేతివేళ్ల కొనల నుంచి తాకాలని అతని సాన్నిధ్యపు పరిమళాన్ని మోహంగా స్పర్శించాలని తన్మయత్వంతో మంచు తుంపరలా కమ్ముకోవాలని...

'బాగ అలసిపోయారా' అడిగాడు.

'వూహూ'

'బెంగగా వుండొద్దు.... వారం రోజుల్లో వస్తా' చెప్పాడు.

'మీరొచ్చాక సంతోషంగా వుంది' అందామె.

'నాకిదంతా strangeగా వుంది' అన్నాడు.

'వూ'

అతను నవ్వాడు గోరువెచ్చగా...

తెలతెలవారే వరకూ యిద్దరూ అలానే వొకర్నొకరు చూసుకొంటూ మౌనంలోకి చిర్నవ్వుల్లోకి బెంగల్లోకి స్పర్శించుకొంటూ...


స్విట్జర్లాండ్ వెళ్లేముందు సెక్యూరిటీ చెక్‌లోకి వెళ్లబోతూ కాల్ చేసాడు. బెంగ తప్పా మరేం ప్రవహించని కాలమది.

అక్కడికి వెళ్లగానే అక్కడి మొబైల్ నెంబర్స్‌తో మెసేజ్ యిచ్చాడు.

సాయంకాలం నుంచి అర్ధరాత్రి వరకు మిస్ అవుతోన్న అతని సాన్నిధ్యం... కాఫీ పరిమళాల్లో రేకెత్తించే జ్ఞాపకాల మాటలు... తెల్లారేక సోఫా పక్కన కనిపించే రాత్రి తాగిన కాఫీ కప్పులు కనిపించకపోవటం... యింత బెంగలో సాయంకాలం నుంచి అతన్నుంచి వొచ్చే మెసేజ్‌లు అదే అల్లరి అదే కొంటెతనం తనకి ఎక్కడా దొరకని చిలిపితనం... వారం రోజులు అయిపోయాయి. అతని పని కాలేదు... మరో వారం అనగానే పొగమంచులా కమ్ముకొన్న బెంగ వొంటరితనం...

అసలిదంతా యేంటీ... యింత యిష్టం... యింత మోహం యింత బెంగా... వూరికే పోవటమేనా... అర్థవంతపు స్నేహాలని జీవితంలోకి అనువదించుకోవటం.... పదిలంగా కాపాడుకోవటం... యింత వొత్తైన యిమోషన్స్ కొనసాగటం అన్నది యిద్దరి మీద ఆధారపడిన సంగతి... కొనసాగాలని యిద్దరికీ వుండాలి... ఎమోషనల్ సబ్‌మిసీవ్‌గా వుండటం నో... అతనికి నాకు మధ్య వున్నది ఏమిటి... యీ మంత్ర నగరి సరిహద్దులు తాకాలనే క్యూరియాసిటీ... తాకితే ఏమవుతుందోననే బెంగ తాకకపోతే యెలా... యెవరు ముందు...యే మోహపు జడివానలోనో జలపాతపు హోరులోనో చలిగాలుల లాలిత్యానికో యెప్పుడో వొకప్పుడు.... యింకా యెన్నాళ్ల అక్కడ... రారాదూ త్వరగా చూడాలి... లాలిత్యం పరుచుకొన్న నీ చేతివేళ్ల కొనల్ని మృదువైన నీ హృదయపు స్నేహాన్ని స్పర్శించాలి... మెలకువగా... కలత నిదురలో మోహపు స్వప్నంగా...

రాత్రి తాలూకు మోహపు బెంగ కొద్దిగానైన వదిలిపోకుండానే అప్పుడే తెల్లారింది.



పావుతక్కువ ఆరు...

వూc... యింకా ఐదు నిమిషాలు... అనుకొంటూ ముసగదీసుకు పడుకొంది. వూహూ... అనుకొంటూ అటుయిటూ తిరుగుతూ ప్చ్! యిలాకాదు...లేవాలి...చాల పనుంది. వూహూ... యిది యిలా వదలదు... కాఫీ... చిక్కని సౌత్ యిండియన్ కాఫీ... యస్ గుడ్ ఐడియా... బోర్ ఐడియా... అటు తిరుగుతోంటే... సెల్‌లో మెసేజ్ వచ్చిన సవ్వడి... చేయి చాచి సెల్ అందుకొని మెసేజ్ వోపెన్ చేసింది.

How is the young lady... coming... coffee... టైమ్ చూసి నెంబర్ చూసింది.

లోకల్ నెంబర్...

వో...వచ్చేసావా... లేచి మంచంపై కూర్చుంది.

గదంతా మసకవెల్తురు

కిటికీ దగ్గరికి వచ్చింది. కర్టెన్‌లాగింది. జివ్వుమంది. కిటికీ పల్చని గ్లాసంతా మబ్బుమబ్బుగా అలముకొన్న మంచు.

వో... ఆ గ్లాసుపై నుదురు ఆన్చింది. ఆకృతి ఏర్పడినంత వేగంగా అలముకొంటున్న మంచు... కుడిబుగ్గ.... ఎడమబుగ్గ... ముక్కుకొన... చేతివేళ్లు... చుబుకం... పెదవులని ఆన్చింది. గుండ్రని చిన్ని పెదవుల ఆకృతిపై రివ్వురివ్వున ఆవిరిలా పాకుతోన్న మంచు. కళ్లల్లో చిలిపినవ్వు ప్రవహిస్తోంటే నాలిక కొన చివర్నుంచి గ్లాసుపై వొక్కో అక్షరం రాస్తుండగానే చరచరా ఆవిరిలా అలముకొంటున్న మంచు. తిరిగి అతని పేరులోని మొదటి అక్షరాన్ని రాస్తోంటే కమ్ముకొంటున్న ఆవిరి మంచుని చూస్తు 'దొంగా...' కళ్లల్లోని పెదవులపై బుగ్గల్లో ఎడమబుగ్గ డింపుల్లో అలఅలా ముఖమంతా ప్రవహిస్తోన్న నవ్వు మోహంగా.

కాలింగ్‌బెల్ సవ్వడి. తలుపు తీసింది.

నవ్వుతూ అతను సుమప్రభాత పరిమళంలా.

అతను లోపలికి వచ్చాడు.

'దా... కాఫీ యిస్తాను' అందామె.

'వూ ఏంటి విషయాలు' అడిగాడు.

ఆమె అతని వైపు చురుగ్గా చూస్తూ 'యిన్ని రోజులా' అని ఆగి- 'ఏంటీ నేనెప్పుడూ ఎవరి విషయం యింతగా ఆలోచించలేదు' అంది.

'సో... ఆలోచిస్తున్నావన్నమాట' అల్లరిగా నవ్వుతూ అడిగాడు.

'సందేహమా. యీ మోడ్రన్ లైఫ్‌లో మెటీరియలిస్టిక్ ప్రపంచంలో వున్నాగలని యిష్టపడే వో కుర్రాడు వుంటాడని నేనెప్పుడూ అనుకోలేదు'

'యింత కాంప్లెక్స్ ప్రపంచంలో మీలాంటి అమ్మాయిని నేనూహించలేదు. మీ ఆలోచనలతో నేనెప్పుడూ తబ్బిబ్బు కాలేదు. మీ ప్రెజెన్స్ చాల శాంతిగా వుంటుంది' అన్నాడు.

'వో నా real being మీరేననిపిస్తోంది' కాఫీ అందిస్తూ అంది. కాఫీ తాగి 'వెళతా' అన్నాడు.

'అప్పుడేనా' ఆమె స్వరంలో బెంగ.

ఆమె వైపు చూసాడు.

చూపుల నిండుగా మోహపు బెంగ పరిమళిస్తోంది. యిద్దరు వొకరివైపు మరొకరు. ఎవరి చేతులు ఎవరిని ముందుగా పెనవేసుకున్నా యో మంత్రనగరి సరిహద్దులని చెరిపివేస్తూ వారిరువురి మనోదేహస్పర్శాలింగనంలో జీవితానందం పరిమళిస్తోంది. (సమాప్తం)